క్లుప్తంగా

ఈ-పంట నమోదు పత్రాలు పంపిణీ

నరసన్నపేట: మండలంలో రబీ పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని నరసన్నపేట వ్యవసాయాధికారి కె.సునీత తెలిపారు. రబీలో ఈ పంట నమోదు 6,500 ఎకరాల్లో చేపట్టామని, 2677 మంది రైతులకు పత్రాలు పంపిణీ చేశామని అన్నారు. శుక్రవారం తండ్యాలవానిపేటలో రైతులకు ఈ-పంట నమోదు పత్రాలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీటి ద్వారా రైతులు తాము పండించే పంటలను ఆర్‌బీకేల ద్వారా అమ్మకాలు చేసుకోవచ్చని అన్నారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత

నరసన్నపేట: మెయిన్ రోడ్డుపై స్థానిక రాజేశ్వరి థియేటర్‌కు వెళ్లే మార్గంలో ఎడమ చేతి వైపున ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణ పనులు చేపట్టేందుకు ఆక్రమణదారులు చేసిన ప్రయత్నాలను నరసన్నపేట పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలంలో పనులు చేస్తున్నట్లు గమనించి పనులు నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో సవర చిన్నారావు మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికల సిబ్బంది సక్రమంగా పని చేయాలి

నరసన్నపేట: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్న బృందాలు సక్రమంగా పనిచేయాలి నరసన్నపేట ఆర్‌వో రామ్మోహనరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ తనిఖీ బృందాలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. చెక్‌పోస్టుల వద్ద, రోడ్లపై తనిఖీలను క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. నరసన్నపేట, పోలాకి తహసీల్దార్లు పి.కనకారావు, ఎస్ఎల్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సదుపాయాలు

ఎల్.ఎన్.పేట: అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సదుపాయాలు ఉండాలని తహసీల్దారు ఎస్.రాణి అమ్మాజీ అన్నారు. బొర్రంపేట పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ విధులు నిర్వహించేందుకు వచ్చిన ఉద్యోగులతో పాటు పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు విద్యుత్, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సదుపాయాలతో పాటు దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసేందుకు వెళ్లేందుకు వీలుగా ర్యాంపు ఉండాలన్నారు. ఆర్ఐ గవరయ్య పాల్గొన్నారు.

పంప్‌హౌస్‌కు తాళం!

హిరమండలం: మేజర్‌పంచాయతీ హిరమండలం రక్షిత పథకం పంప్ హౌస్‌కు గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేయడంతో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడ్డారని మేజర్ పంచాయతీ ఈవో నర్సింగరావు తెలిపారు. రెండు రోజులుగా పంప్‌హౌస్‌కు తాళం వేసి ఉండటంతో ఆపరేటర్ నీటిని సరఫరా చేయలేకపోయారన్నారు. నీటి సరఫరా జరగలేదని ఫిర్యాదు రావడంతో ఆపరేటర్‌కు ఆరా తీయగా పంప్ హౌస్‌కు తాళం వేసి ఉందని.. నీటిని సరఫరా చేయలేదని తెలిపారన్నారు. శుక్రవారం ఈవో పంప్ హౌస్‌ను పరిశీలించగా తాళం వేసి ఉండటంపై ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఈవో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తూరు: మండల కేంద్రంలోని 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల్లో భాగంగా శనివారం సరఫరాను నిలిపి వేస్తున్నట్లు కొత్తూరు విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ సరఫరాను నిలిపివేయనున్నట్టు చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

సారవకోట: బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. 148 విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ప్రధానోపాధ్యాయుడు మాధవరావు అందజేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో వివరించారు. ఈ సందర్భంగా సినీ, జానపద పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఉపాధ్యాయులు యోగేశ్వరరావు, రవి తదితరులున్నారు.

వోవీపేటలో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో ఎస్సై జి.వి.ప్రసాద్, సిబ్బంది

బూర్జ: మండలంలోని వోవీపేట గ్రామంలో స్థానిక ఎస్సై జి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వరం

హిరమండలం: జగనన్న ఆరోగ్య సురక్ష నిరుపేదలకు వరమని పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్ అన్నారు. హిరమండలం సచివాలయం-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు.

సీఎం జగన్‌తోనే మహిళల ఆర్థికాభివృద్ధి



చెక్కును మహిళలకు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- వైఎస్సార్ చేయూత సంబరాల్లో స్పీకర్ తమ్మినేని



చేయూత సంబరాల్లో పాల్గొన్న మహిళలు

ఆమదాలవలస రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమైందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలసలోని మార్కెట్ యార్డు ఆవరణలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత సంబరాలను శుక్రవారం నిర్వహించారు. ముందుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం చేయూత నాలుగో విడతగా ఆమదాలవలస నియోజకవర్గానికి చెందిన 17,998 మంది లబ్ధిదారులకు రూ. 33.75 కోట్ల నమూనా చెక్కును మహిళా సమాఖ్య సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు సీఎం జగన్‌తోనే సాధ్యపడుతుందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారునికి బ్యాంక్ అకౌంట్‌కు సంక్షేమ పథకాల సొమ్ములను జమ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. అక్క చెల్లెమ్మలను ఆదుకునేందుకు ఆసరా, చేయూత, వడ్డీ మాఫీ, జగనన్న తోడు వంటి పథకాలను అందజేసినట్లు తెలిపారు. మహిళలకు ఆర్థికంగా భరోసా కల్పించడానికి చేయూత ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పేదలకోసం జగనన్న ఎన్నో విధాలుగా బటన్ నొక్కి మనకు సొమ్ములు జమ చేశారని, మరలా రాజన్న పాలన రాష్ట్రంలో అమలు కావాలంటే ఓటు అనే బటన్ ప్రతీ ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై నొక్కాలని కోరారు.

విద్య హబ్‌గా ఆమదాలవలస..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ఆమదాలవలస నియోజకవర్గాన్ని విద్యా హబ్‌గా మార్చినట్టు స్పీకర్ చెప్పారు. అలాగే ఇసుకలపేట వద్ద బలసలరేవు బ్రిడ్జి నిర్మాణం, తొగరాం, పొందూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలు, పొందూరు, ఆమదాలవలసలో మహాత్మ జ్యోతిరావు పూలే జూనియర్ కళాశాలలు, తొగరాంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, వెన్నెలవలసలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, బూర్జ మండలం పెద్దపేటలో హార్టీకల్చర్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు, ఆమదాలవలస పట్టణంలో ఇండోర్ స్టేడియం మంజూరు, జగ్గుశాస్త్రులపేట వద్ద క్రికెట్ స్టేడియం మంజూరు, పొందూరు మండలం వావిలపల్లిపేటలో ఏపీ మోడల్ జూనియర్ కళాశాల ప్రారంభం, రొట్టవలసలో బాలికల జూనియర్ కళాశాల ప్రారంభం, నియోజకవర్గంలో రూ. 176 కోట్లతో ఇంటింటా తాగునీటి కుళాయిల ఏర్పాటు, సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం వంటివి ఏర్పాటు చేసి ఆమదాలవలసను అభివృద్ధి చేసిన ట్టు చెప్పారు. అభివృద్ధి చూసి ఓర్వలేని టీడీపీ, పచ్చ మీడియా వైఎస్సార్‌సీపీపై లేనిపోని అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. గత టీడీపీ పాలనలో అవినీతి, అక్రమాలు తప్ప ప్రజలకు చేసిన ఒక్క మంచి పనినైనా చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. పరిపాలన చేతకాని అసమర్థులు పనికిరాని స్టేట్‌మెంట్‌లు ఇస్తున్నారని విమర్శించారు. టీడీపీ హయాంలో అభివృద్ధి చేయకుండానే చేసినట్లు ఉపన్యాసాలు ఇస్తే ఎన్నికల్లో డిపాజిట్లు దక్కవని తెలిపారు. టీడీపీకి ఓటమి భయం పట్టుకోవడంతో మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. టీడీపీ హయాంలో రెల్లిగెడ్డ పనుల్లో అవినీతికి పాల్పడటంతో టీడీపీ నాయకులు దాహానికి ఇరిగేషన్ అధికారులు బలయ్యారని తెలిపారు. గ్రామాల్లో టీడీపీ హయాంలో వేసిన రోడ్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా సొంత కుటుంబీకులకు కాంట్రాక్ట్ పనులు అప్పగించడంతో అవి గోతుల మయంగా మారాయని తెలిపారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, తొగరాం పంచాయతీ సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ, మండల ప్రత్యేకాహ్వానితులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, కేవీజీ సత్యన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు బెండి గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ నాయకులు జెవర మల్లేశ్వరరావు, ఖండాపు గోవిందరావు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

- పాఠశాల భవనాల ప్రారంభంలో స్పీకర్ సీతారాం



అదనపు భవనాలను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: విద్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇచ్చారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని గేటు ప్రాంతంలో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు నిధులు రూ. 96 లక్షలతో నిర్మించిన పాఠశాల అదనపు భవనాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగితే ఉత్తమ ఫలితాలు సాధించగలరన్నారు. పోటీ ప్రపంచంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యతను ప్రభుత్వం అందించడం వలన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఆస్కారం కలుగుతుందన్నారు. రానున్న రోజుల్లో విద్యారంగం రాష్ట్రంలోనే జిల్లా అగ్రగామిగా నిలుస్తోందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో చేయలేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో బలోపేతం చేయడం జరిగిందన్నారు. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందన్నారు. అమ్మఒడి పథకం, విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద వంటి పథకాల ద్వారా పేదల చదువులకు భరోసా కల్పిస్తున్నారని గుర్తు చేశారు. జగనన్న పాలనలో చదువుల విప్లవాన్ని గ్రామస్థాయిలో చూస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, ఎంఈవో రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రవి, ఏఈ బి.సృజన, పాఠశాల హెచ్ఎం పీవీ రమణమ్మ, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజాపాలన



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి ప్రజలకు పాలనను చేరువ చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పరశురాంపురంలో సచివాలయ భవనం, అదే సచివాలయం పరిధి నందవ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేశామన్నారు. అనంతరం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, మండల నాయకులు బైపోతు ఉదయ్ కుమార్, వైస్ ఎంపీపీ సవర ఆదినాయుడు, సర్పంచ్‌లు ప్రసాద్, ఈశ్వరరావు, మండల కన్వీనర్ పల్లి యోగి, బైపోతు తేజారావు, లింగాల సంజీవరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, కోఆప్షన్ సభ్యుడు భాస్కరదాస్, నాయకులు టి.ప్రసాద్, జయమునిరావు, జమ్మయ్య ఉన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలి

సరుబుజ్జిలి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవాలని బూర్జ ఐసీడీఎస్ సీడీపీవో శివకోటి గీత అన్నారు. పోషణ్‌పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా పురుషోత్తపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హోమ్‌విజిట్ కార్యక్రమం పేరుతో ప్రతీ ఇంటికి వెళ్లి లబ్ధిదారులు, ఏడు నెలల నుంచి 24 నెలల వయస్సుగల పిల్లలు ఆరోగ్యసంరక్షణగురించి, గర్భిణులు పాటించాల్సిన ఆరోగ్యసూత్రాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రాధ, ధనలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

సచివాలయాలతో సత్ఫలితాలు

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం-1 గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: గ్రామ సచివాలయ వ్యవస్థతో సత్ఫలితాలు వచ్చాయని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం పంచాయతీ కార్యాలయం వద్ద రూ.25 లక్షల ఉపాధి నిధులతో పాతపట్నం-1 గ్రామ సచివాలయం, మండలంలోని కొరసవాడ గ్రామంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుబాటులోనే సేవలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెందిందన్నారు. ఆర్‌బీకేలతో విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారన్నారు. రైతులకు పంటల బీమా, నష్ట పరిహారం, సబ్సిడీలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రామకృష్ణరాజు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కె.అర్జునుడు, ఎం.తాతయ్యలు, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, మండల సచివాలయ కన్వీనర్ వై.సూర్యం, కార్యదర్శి జి.రాము, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ వెంకటరమణ, వీవర్స్ జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రయ్య, పార్టీ నాయకులు శిర్ల జోగారావు, కర్రి లక్ష్మీనారాయణ, టంకాల సుధా, మజ్జి వరదరాజులు, సర్పంచ్ ఉమా, ఎంపీటీసీ ఎం.సుగుణ పాల్గొన్నారు.

వినియోగదారులు హక్కులు తెలుసుకోవాలి

నరసన్నపేట: ప్రతీ పౌరుడూ వినియోగదారుడే అని.. వారి హక్కుల కోసం ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలను తెలుసుకోవాలని నరసన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవ సందర్భంగా కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొనుగోలు చేసే వస్తువుల నుంచి సంతృప్తికరమైన ప్రతిఫలం పొందక పోయినా, సదురు వస్తువుల నుంచి ప్రమాదం, ప్రాణనష్టం జరిగినా, నాణ్యలతో తేడాలు గమనించినా 1986, 2019 వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని అన్నారు. వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు పల్లవి, వైస్ ప్రిన్సిపాల్ శాంతిహేమ్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆమదాలవలస: వినియోగదారుల హక్కులు, చట్టాలపై విద్యార్థి దశనుంచే అవగాహన కలిగి ఉండాలని ఆడిటర్ బుడుమూరు శ్రీనివాసరావు సూచించారు. ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు.


రక్షణ గోడలతో వరదల నివారణ



ముద్దాడపేట వద్ద రివర్ ప్రొటక్షన్ వాల్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని

ఆమదాలవలస రూరల్: నాగావళి నదీ పరివాహక గ్రామాల్లో వరదల నివారణ కోసం రివర్ ప్రొటక్షన్ వాల్ నిర్మాణాలు చేపట్టినట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ముద్దాడపేట, ఫేర్‌సాహెబ్‌పేట గ్రామాల్లో రూ. 96 లక్షలతో నిర్మించిన రివర్ ప్రొటక్షన్ వాల్‌ను (రక్షణ గోడ) శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదలు వచ్చే సమయంలో నాగావళి నదికి ఆనుకుని ఉన్న గ్రామాలకు కోతకు గురికావడంతో పాటు వరద నీరు ఇళ్లల్లోకి ప్రవేశించి ఆస్తి, పంట నష్టాలు జరుగుతున్నాయన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో వరదలను నివారించడానికి రక్షణ గోడ నిర్మాణాల తక్షణ నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. రక్షణ గోడ నిర్మాణాలు పూర్తి కావడం వలన వరద నీరు గ్రామాల్లోకి రాకుండా ఉంటుందని, దీనివలన నదీతీరం కోతకు గురికాకుండా నిలుపుదల చేయడానికి ఆస్కారం కలుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు ఆదరించాలని అన్నారు. నాగావళి పరీవాహక ప్రాంతం అభివృద్ధి చేయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అందులో భాగంగా ఇసుకలపేట గ్రామం వద్ద నాగావళి నదిపై బలసలరేవు బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పార్టీ నాయకులు గురుగుబెల్లి గిరి, కూటికుప్పల సన్యాసిరావు, చిగురుపల్లి దశరథ, గొంటి కృష్ణ, తాండ్ర ధనుంజయరావు, బెండి జయరాం, చేపాన కృష్ణ, బమ్మిడి అచ్యుతరావు, గురుగుబెల్లి నీలారావు, తిర్లంగి రామారావు, ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ పి.సుధాకర్, డీఈ ఎం.మురళీమోహన్, ఏఈఈ కె.రాంబాబు ఉన్నారు.

పీఏసీఎస్ సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

పోలాకి: రైతాంగం పీఏసీఎస్ సేవలను వినియోగించుకోవాలని డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు అన్నారు. పోలాకి పీఏసీఎస్‌లో మహాజనసభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీసీసీబీ సేవలు పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతున్నట్లుగానే పీఏసీఎస్‌లు సైతం ఆన్‌లైన్ చేస్తున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగా పోలాకి పీఏసీఎస్‌ను ముందుగా ఆన్‌లైన్ చేస్తున్నామని తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఆన్‌లైన్‌లోనే సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. సీఈవో రాంబాబు మాట్లాడుతూ.. ఈఏడాది పోలాకి పీఏసీఎస్‌లో రూ. 30 కోట్లు టర్నోవర్ జరిగిందని.. అందులో రూ. 18 కోట్లు రుణాలుగా, రూ. 1.52 కోట్లు ఓడీ ఎకౌంట్స్ ద్వారాను రైతులకు అందజేశామన్నారు. దీంతోపాటు ధాన్యం కొనుగోలు ద్వారా రూ. 39.78 లక్షలు, ఎరువుల అమ్మకం ద్వారా 25 వేల రూపాయలు అదనంగా సంఘానికి ఆదాయం చేకూరిందని వివరించారు.

మహిళాభ్యున్నతికి సీఎం జగన్ పెద్దపీట

- చేయూత చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మెళియాపుట్టి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డిశాంతి



ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మెళియాపుట్టి: పాల్గొన్న మహిళలు

మెళియాపుట్టి: మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ.. ప్రతీమహిళ ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే రెడ్డిశాంతి అన్నారు. స్థానిక దుక్కరాజన్న రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వెలుగు ఏపీఎం లలిత అధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ చేయూత సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. 8.57 కోట్ల రూపాయల చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కులాలు, మతాలు, జెండాలు చూడకుండా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కను దక్కిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం చేయూత డబ్బులను వరుసగా నాలుగో ఏడాది కూడా మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నారని అన్నారు. మెళియాపుట్టి మండలంలో 4,574 మందికి రూ.31.73 కోట్లు అందించినట్టు చెప్పారు. ఇచ్చిన హామీలు నెరవేర్చుతూ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, మహిళలందరూ చల్లని మనసుతో దీవించి జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకరం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, కోఆప్షన్ సభ్యుడు భాస్కరదాస్, ట్రైకార్ డైరెక్టర్ సవర ఈశ్వరమ్మ, వ్యవసాయ సలహామండలి చైర్మన్ మాధవరావు, మండల నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, పల్లి యోగి, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కె.శశిభూషణ రావు, వెలుగు సీసీలు, సీఏలు, మహిళాసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మహిళలను మోసగించిన చంద్రబాబు

ఎల్.ఎన్.పేట: మహిళలను ఆర్థికంగా ఆదుకుంటామని 2014 ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఐదేళ్ల గడిచే సమయానికి మహిళలకు పసుపు, కుంకుమని చెప్పి రూ.10 వేలు చెల్లించి మహిళలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కోవిలాం కాలనీ వద్ద నాలుగో విడత వైఎస్సార్ చేయూత సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని 600 హామీలు ఇచ్చి ఆరు హామీలు కూడా నెరవేర్చలేని చేతకాని సీఎం ఎవరైనా ఉన్నారంటే ఆయన చంద్రబాబు అని చెప్పుకోవచ్చన్నారు. ఇచ్చిన హామీలతో పాటు అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం నిరంతరం పరితపించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అండగా నిలిచారని కొనియాడారు. నిరంతరం మహిళల సంక్షేమాన్ని కోరుకునే జగనన్నకు ప్రతీ మహిళా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, ఎంపీడీవో గిరిబాల, ఈటీపీఆర్డీ ఐ.పద్మజ, వైకేపీ ఏపీఎం రవిరాజ్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, పార్టీ నాయకులు తొత్తడి మురళీకృష్ణ, శిమ్మ సాంబశివరావు, ఈగల చిన్నారావు, ముగడ జనార్దన, యరబాటి గణపతి, బలగ గోవిందరావు, తలసముద్రం శోభన్‌బాబు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజేష్‌శర్మ



ఉత్తర్వులు అందుకుంటున్న రాజేష్‌శర్మ

ఆమదాలవలస: బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఆమదాలవలసకు చెందిన బలివాడ రాజేష్‌శర్మ నియామకం అయ్యారు. ఈ మేరకు అమరావతి నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ఈ పదవిని అప్పగించినందు కు స్పీకర్ తమ్మినేని సీతారాంకు కృతజ్ఞతలు తెలియజేశారు. బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం చేరువ



బ్రోచర్లను అందజేస్తున్న నాయకులు

కొత్తూరు: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి అన్నారు. నివగాంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు తెలియజేయడంతోపాటు చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. సంక్షేమ పథకాలన్నీ అమలు కావాలంటే సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పంకజ దాస్, కార్యదర్శి మఠం పూర్ణ, గార రాజులు నాయుడు, నాయకులు రాడ రాజు, బొడ్డేపల్లి రామకృష్ణ, వనుము లక్ష్మీనారాయణ, తిర్లింగ కృష్ణమోహన్, పి.నాయుడు, నగేష్, పాపారావు ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల క్యాలండర్ ఆవిష్కరణ

ఎల్.ఎన్.పేట: మండలంలోని సమగ్ర శిక్షా, ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ ఉపాధ్యాయల క్యాలండర్‌ను ఎంఈవోలు చంద్రమౌళి, మణికుమార్‌లు శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆవిష్కరించారు. క్యాలండర్ ప్రకారం విద్యార్థులకు ప్రతీ నెలా చేపట్టాల్సిన ఆటలు, డ్రాయింగ్ వంటి బోధనల కోసం అవగాహన కల్పించాలన్నారు. రావిచెంద్రి జెడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీ కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

హిరమండలం: ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వి.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. శుక్రవారం డ్వాక్రా సంఘ మహిళలతో ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్‌స్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం చేపట్టారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

హిరమండలం: కిట్టలపాడు ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గతంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రవికుమార్, పార్వతీ, నాగభూషణరావు ,సూర్యనారాయణలను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఎంఈవో కె.రాంబాబు, సర్పంచ్ జి.ప్రభావతి, విద్యాకమిటీ చైర్మన్ కె.శ్రీనివాసరావు ఉన్నారు.

ఓటు హక్కు వినియోగంపై మానవహారం

సారవకోట: మండల కేంద్రంలో ఇందిరకాంత్రి పథం ఆధ్వర్యంలో స్వయం శక్తి సంఘాల మహిళలు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా జాతీయ రహదారిపై మానవ హారం నిర్వహించి ఓటు హక్కు ప్రాధాన్యతపై నినాదాలు చేశారు. ఏపీఎం గోవిందరాజులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



మానవహారంలో మహిళా సంఘాల సభ్యులు